కథ

# కొంటె


తాడిమేటి శ్రీదేవి

99126 07227




'అమ్మా!' అంటూ నన్ను అల్లుకుపోయిన నా ఆరేళ్ల కూతుర్ని దగ్గరికి తీసుకున్నాను. దానికి అన్నం పెట్టి.. నోరు మూయకుండా చెప్తున్న కబుర్లు వింటూ, దాని ముద్దు మొహం చూస్తూ ఉండిపోయాను. నేను, తమ్ముడు ఇలాగే అన్ని విషయాలూ ఏకరవు పెట్టడం, అమ్మ ఆసక్తిగా వినడం కళ్ల ముందు కదిలాయి. అంతలో గతమంతా గుర్తుకు వచ్చి నా కళ్లు తడిదేరాయి. నా ప్రమేయం లేకుండానే మనసు గతంలోకి పరిగెత్తడం వల్ల 'ఊ!' కొడుతూ ఆలోచనల్లోకి కూరుకుపోయాను.

* * *

''నేను వెళ్లనని చెప్తున్నాను. ఎన్నిసార్లు చెప్పాలి? రేపో, మాపో పిల్ల పెద్దదవుతుంది. పిల్లాడు నేను లేకపోతే ఉండలేడు. అంతగా కావాలంటే మీరు వెళ్లి సంపాదించుకొని రండి. నేను పిల్లల్ని చూసుకుంటూ ఏదో ఒక పనిచేస్తూ ఉంటాను'' గట్టిగా అంటున్నది అమ్మ.

''నేను వెళ్లే పని ఉంటే నేను వెళ్లనా? ఈసారి వంట పని, ఇంటిపనులకు ఆడవాళ్లు కావాలని బ్రోకర్ చెప్పాడు. రెండేళ్లు సంపాదించుకుని వచ్చావంటే పిల్లల్ని బ్రహ్మాండంగా పెంచొచ్చు. పిల్లకు పెళ్లి చేయాలన్నా.. పిల్లాణ్ని పెద్ద చదువులు చదివించాలన్నా మనవల్ల అయ్యే పనేనా? నువ్వు కాళ్లు అరిగేలా మిషిన్ తొక్కి, నేను దొరికిన పనల్లా చేస్తూ ఇలా ఎంతకాలం?''..

అమ్మానాన్న ఇద్దరూ చాలాసేపు గొడవపడ్డారు.

ఆఖరికి నాన్న మాటే నెగ్గింది. బహుశా మా గురించి ఆలోచించే అమ్మ ఒప్పుకొని ఉంటుంది. ఆరోజు నుంచి దుబాయ్ బయల్దేరే వరకూ అమ్మ కంటితడి ఆరలేదు. తమ్ముణ్ని జాగ్రత్తగా చూసుకోవాలని నాకు, మమ్మల్ని ద్దర్నీ మంచిగా చూసుకోవాలని నాన్నకు పదేపదే చెప్పింది. వదల్లేక వదల్లేక బయల్దేరింది. నేను ఆరిందాలా మారిపోయినట్లు అనిపించింది. నాన్న సాయంతో వంటచేయడం, స్కూల్‌కు వెళ్లడం, తిరిగి వచ్చాక ఇంటి పని, వంటపని చేసి.. తమ్ముణ్ని చదివిస్తూ నేను చదువుకోవడం, వాడు బెంగపడకుండా చూసుకోవడం నాకు నెమ్మదిగా అలవాటయ్యాయి.

అమ్మ దగ్గరినుంచి ఫోన్ వచ్చినప్పుడు మాకు పండుగలా ఉండేది. అమ్మ మొదటిసారి పంపిన డబ్బులతో మాకిద్దరికీ బట్టలు, బొమ్మలు తెచ్చాడు నాన్న. కానీ, క్రమంగా నాన్న తాగుడుకు అలవాటు పడ్డాడు. అమ్మతో చెప్పేస్తానని బెదిరిస్తే జన్మలో ముట్టుకోనంటూ ఒట్టు పెట్టుకోవడం.. మళ్లీ కుక్క తోక వంకరలా మొదలుపెట్టడం.

ఇంతలో అశనిపాతం లాంటి వార్త. అమ్మ పని చేసే ఇల్లు గలావిడ ఎవరితోనో అక్రమ సంబంధం పెట్టుకోవడం అమ్మ చూసిందట. ఆ విషయం బయటికి చెబుతుందేమోననే భయంతో తన ఏడాది బిడ్డను ప్రియుని సహాయంతో చంపేసి.. ఆ నేరం అమ్మ మీదికి తోసేసిందిట ఆమె. దాంతో అమ్మను జైల్లో వేసేశారు. కష్టపడి సంపాదించి, పిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దామని దుబాయ్ వెళ్లిన అమ్మ జైలు పాలైంది. కానీ ఆమె జైల్లో చేసిన పనులకు వచ్చిన డబ్బును ఇంటికి పంపేది. ఆ డబ్బు నాన్న సారా కొట్టుకు జమయ్యేది. నాన్న పూర్తిగా మారిపోయాడు. మేము తిరగబడుతున్నామని మా మీద చేయి చేసుకోవడం మొదలుపెట్టాడు. అమ్మకు చెప్పుకొందామంటే.. జైల్లో నుంచి ఫోన్ ఎప్పుడో గానీ రాదు. ఇవన్నీ చెప్పి అమ్మను బాధపెట్టడం ఎందుకని, చెప్పినా ఏం చేయగలదని చెప్పేదాన్ని కాదు.

''ఎందుకు సుమా! అలా కొడుతున్నావు వాణ్ని?'' అంటూ నా చేతిలోని కర్రను లాక్కుని కింద పడేశారు భారతి టీచర్.

ఒక్కసారిగా నా బాధంతా కరిగి కన్నీటి రూపంలో బయటికి వచ్చింది.

''ఏమైందమ్మా?'' అంటూ దగ్గరికి తీసుకున్నారు.

ఆవిడ అమ్మలా అనిపించి.. అన్ని విషయాలు చెప్పేశాను.

''ఇప్పుడు చూడండి టీచర్! వీడు స్కూల్ మానేసి తిరుగుతున్నాడు'' అన్నాను.

''సరే తల్లీ! ఏదో తెలియక చేశాడులే. ఇవాల్టినుంచి మా ఇంటికి వచ్చి మా పిల్లలతోపాటు చదువుకోండి!'' అని చెప్పారావిడ.

అప్పటినుంచి రోజూ సాయంత్రం టీచర్ వాళ్ల ఇంటికి వెళ్లేవాళ్లం. టీచర్ గారు, ఆవిడ భర్త కూడా చాలా మంచి వారు. నేను టెన్త్‌క్లాస్ స్కూల్ సెకండ్ వచ్చినప్పుడు నాకన్నా వాళ్లే ఎక్కువ సంతోషించారు.

''నాన్నా! ఇంటర్లో చేర్పించవా?'' భయపడుతూనే అడిగాను.

''చూద్దాంలే!'' అన్న చిన్న మాటకే నా మనసు ఆనందపడింది.

ఆరోజు సాయంత్రం నన్ను, తమ్ముణ్ని బయటికి తీసుకువెళ్లాడు నాన్న. తమ్ముడు గాలిపటంతో ఆడుకుంటున్నాడు.

'కాలేజీలో చేరబోతున్నాను!' అనే ఆనందంతో నేను కూడా వాడితోపాటు ఎంజాయ్ చేస్తున్నాను. కాస్త దూరంలో చిన్నకారు ఆగింది. నాన్న నన్ను పిలిచాడు.

''వీళ్లు పేద పిల్లలను చదివిస్తూ ఉంటారు. నీకు టెన్త్‌లో మంచి మార్కులు వచ్చాయని చెప్తే.. చదివిస్తామని చెప్పారు'' అని చెబుతున్నాడు.

కానీ, వాళ్ల చూపులు నాకెందుకో నచ్చలేదు. నమస్కారం చెప్పి వెనక్కి తిరగబోతున్నప్పుడు నా ముక్కు మీద ఏదో అదిమి పెట్టినట్లు అనిపించింది. ఆ హఠాత్ పరిణామానికి ఉలిక్కిపడి నాకు తెలియకుండానే రెండు చేతులతోనూ తోసెయ్యడానికి ప్రయత్నించాను. నన్ను కదలనివ్వకుండా గట్టిగా పట్టుకుని కారు లోపలికి నెట్టారు. అందులో ఉన్న ఒకరు నాన్న చేతిలో డబ్బుకట్ట పెట్టడం కనిపించింది. గింజుకుంటున్న నాకు కళ్లు మూతలు పడిపోసాగాయి. స్పృహ పోతుండగా తమ్ముడు కారు వైపు పరిగెత్తుకుంటూ రావడం కనిపించింది.

మళ్లీ నాకు మెలకువ వచ్చేసరికి ఎక్కడ ఉన్నానో అర్థం కాలేదు. తలంతా దిమ్మెక్కి ఉంది. తలుపు దగ్గర ఏవో నవ్వులు వినిపించాయి. మొరటుగా కనిపించే ఒకతను లోపలికి వచ్చి మీద చేయి వేశాడు.

లాగిపెట్టి కొట్టాను.

''అబ్బో.. చాలా ఉందే!'' అంటూ వెకిలిగా నవ్వాడు.

వాడినుంచి తప్పించుకుందామని తలుపులు బాదినా, అరిచినా లాభం లేకపోయింది. ఆ నాలుగు గోడలు నాకు సమాధి కట్టాయనిపించింది.

'నాన్న'.. ఆ పేరు తలుచుకోవడానికే కంపరంగా అనిపిస్తున్నది. తాగి పడిపోతే తల్లిలా అన్నం తినిపించేదాన్ని. కన్న కూతుర్ని కసాయివాడిలా ఇలా ఎలా చేయగలిగాడు? తాగుడు.. ఒక మనిషిని ఇంతలా దిగజారుస్తుందా!? చదువు పేరుతో ఎంత మోసం చేశాడు! అమ్మ మా గురించి వెళ్లి దేశం కానీ దేశంలో జైలు పాలైంది. మమ్మల్నిద్దర్నీ బాగా చూసుకుంటున్నాడని అమాయకంగా నమ్మి రెక్కలు